www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 21 డిసెంబర్ 2025

5

తూర్పుగోదావరి



సత్య సాయిలో సైన్స్ ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ఐఎల్‌టిడి సెంటర్ వద్ద గల శ్రీసత్యసాయి గురుకులంలో నిర్వహిస్తున్నట్లు డిఇఒ కంది వాసుదేవరావు తెలిపారు. శనివారం ఆయన వేదిక వద్ద కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 7 అంశాల నుంచి మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన ప్రదర్శన మాత్రమే హాజరుకావాలి. విద్యార్థి వ్యక్తిగత ప్రదర్శనలో మొదటి, ద్వితీయ స్థానం ఇద్దరినీ జిల్లా స్థాయికి పంపాలని సూచించారు. ఉపాధ్యాయ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన వారు కూడా హాజరవ్వాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి జివిఎన్ఎస్.నెహ్రూ, హెచ్‌ఎం కోలా సత్యనారాయణ, శీలం రవికుమార్, సత్యసాయి గురుకులం ప్రిన్సిపల్ గుర్రయ్య పాల్గొన్నారు.

తాగునీటి భద్రత ప్రజల హక్కు

జలధార శంకుస్థాపనలో మంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి, పెరవలి

తాగునీటి భద్రత ప్రజల హక్కు అని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. పెరవలిలో శనివారం అమరజీవి జలధార శంకుస్థాపనలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడారు. అమరజీవి జలధార ద్వారా చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐదు జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ ప్రాజెక్టుల ద్వారా వచ్చే 35 ఏళ్లలో 1.21 కోట్ల మంది దాహర్తి తీర్చాలని సంకల్పించామని తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీర ప్రాంతం వెంబడి నివసించే మత్స్యకారులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ఎక్కువ శాతం తీర ప్రాంతాలను కలిపేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని తెలిపారు. 2027 నాటికి పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం అమరుడైన పొట్టి శ్రీరాములును సదా స్మరించుకోవాలనే ఉద్దేశంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు అమరజీవి జలధారగా పేరు పెట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కనబెడితే కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి, ఏషియన్ బ్యాంకుతో చర్చించి మళ్లీ ప్రాజెక్టును పట్టాలెక్కించామన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు చేయడం చాలా సహజమని, ఆ విమర్శలు నిర్మాణాత్మకమైన విమర్శలుగా ఉండాలి తప్పితే గీత దాటి మాట్లాడతాం అంటే ఊరుకోబోమని ఆయన వైసిపి నేతలను హెచ్చరించారు. పిఠాపురంలో చిన్న పిల్లల మధ్య సామాజికవర్గాల పేరిట చిచ్చు పెట్టారని, రాజకీయం చేయడానికి వేరే దారులే లేవా అని ప్రశ్నించారు. ఇలాంటి పనులు చేసే వారికి సిగ్గుండాలని హితవు పలికారు. 2024లో జల్ జీవన్ మిషన్ గడువు ముగిసేనాటికి ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడాల్సిన వేల కోట్ల నిధులు నిరుపయోగంగా మిగిలిపోయాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తాను ఢిల్లీ వెళ్లి కేంద్రంలో ఉన్న పెద్దలతో చర్చించి జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు గడువు పొడిగించేందుకు ఒప్పించామన్నారు. ఈ రోజు రాష్ట్రానికి ఇన్ని రూ.వేల కోట్లు తీసుకువస్తున్నామంటే దానికి కారణం ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆయన సంపూర్ణ సహకారంతో, సిఎం చంద్రబాబు అపార అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలుగుతున్నారు. రోడ్ల నిర్మాణంలో గానీ, అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనుల్లో కానీ నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను ఆయన హెచ్చరించారు. అనంతరం పాజెక్టు వివరాలు తెలిపే ఫోటో గ్యాలరీ, అజ్జరం గ్రామంలో ఇత్తడి, కాంస్యంతో చేసిన వస్తువులతో కూడిన స్టాల్‌ను మంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించారు. ఇత్తడి పరిశ్రమకు పేర్గాంచిన అజ్జరం గ్రామానికి చెందిన నాయకులు ఇత్తడి ప్రతిమను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి దుర్గేష్, టిడిపి ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారుల ద్వారా అందించారు. సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ద్వారా అమరజీవి జలధార ప్రాజెక్టు శంకుస్థాపన ఒక అద్భుత ఘట్టమనఆనరు. ఇది ఉభయ గోదావరి జిల్లా వాసుల దశాబ్దాల కల అని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ధవళేశ్వరం వద్ద అత్యాధునిక సాంకేతికతతో కూడిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించి గ్రావిటీ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గోదావరి జలాలు శుద్ధి చేసి పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించనున్నామని తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఏలూరు, అంబేద్కర్ కోనసీమ తదితర 5 జిల్లాల్లోని 23 నియోజకవర్గాలు, 66 మండలాల్లోని 67.82 లక్షల మంది ప్రజలకు ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తారని తెలిపారు. గోదావరి డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పునీరుగా మారడం, కలుషితం కావడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు, తమ పక్కనే గోదావరి కాలువ, నది ప్రవహిస్తున్నప్పటికీ గుక్కెడు గోదావరి నీళ్లు దొరకడం కష్టంగా ఉన్న సమయంలో ట్యాంకర్లు, భూగర్భజలాలపై ఆధారపడటానికి పరిష్కారం చూపుతూ ఈ కార్యక్రమానికి బీజం వేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాజెక్ట్‌ను సకాలంలో పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపుతుందని హామీ ఇస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురాం కష్ణంరాజు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలో ప్రధాన సమస్య తాగునీరు ఈ ప్రాజెక్టుతో పరిష్కారం అవుతుందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం గర్వించదగ్గ విషయం అన్నారు. ఉండి నియోజకవర్గం భూగర్భ జలాలు కలుషితం ఆ ప్రాంతానికి ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ రూ.350 కోట్లతో నిర్మించతలపెట్టిన వాటర్ గ్రిడ్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తొలుత పవన్ కల్యాణ్‌కు మంత్రి కందుల దుర్గేష్, నాయకులు, ఘనస్వాగతం పలికారు. ఈ సభలో ఎంఎల్‌ఎలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, గిడ్డి సత్యనారాయణ, సత్య ప్రభ, చింతమనేని ప్రభాకర్, పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయర్, జ్యోతుల నెహ్రూ, పంతం నానాజీ, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ చైతన్య, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



సభలో పాల్గొన్న మంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, ఎంఎల్‌ఎలు

వికసిత్ భారత్ శిక్ష బిల్లును రద్దు చెయ్యాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

వికసిత భారత్ శిక్ష అధిక్షక్ బిల్లును వెంటనే రద్దు చెయ్యాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా డిమాండ్ చేసారు. రాజమహేంద్రవరం వై.జంక్షన్ సెంటర్‌లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ 2018లో ప్రవేశపెట్టిన హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లును ఇప్పుడు వికసిత్ శిక్షా అధీక్షక్ పేరుతో యూనియన్ క్యాబినెట్ ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. యుజిసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి సంస్థల స్థానంలో హెచ్ఇసిఐ వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యారంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఎన్‌డిఎ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం, ఆర్ఎస్ఎస్ మతపరమైన ప్రయోజనాల కోసం విద్యారంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్యీకరించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ బిల్లు ఆమోదం వల్ల విద్యారంగంలో నిధులు, పని తీరులో భారీ మార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. యుజిసిని రద్దు చేయడం వల్ల వృత్తి విద్యాకోర్సులు లేని విద్యా సంస్థల గొంతు నులిమినట్లేనని అన్నారు. విద్య ధనవంతులకే పరిమితమై పేద విద్యార్థులకు భారంగా మారుతుందని, తద్వారా విద్యా వ్యవస్థలో అంతరాలు ఏర్పడతాయన్నారు. విద్యార్థి సంఘాలు, మేధావులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞాపనలను, విమర్శలను పట్టించుకోకుండా ఈ బిల్లును తీసుకువస్తున్నారని అన్నారు. ఈ బిల్లును ఆమోదించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమన్నారు. విద్యాసంస్థల్లో కేంద్ర ప్రభుత్వ భావాజాలన్ని రుద్దడమేనని అన్నారు. హెచ్ఇసిఐ నిర్మాణం కూడా ప్రశ్నార్థకంగా ఉందని, ఇందులో 12 మంది సభ్యులలో 9 మందిని కేంద్రమే నియమిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని తన చేతుల్లో ఉంచుకుని తన భావజాలానికి అనుగుణంగా విద్యారంగాన్ని మార్చే కుట్ర చేస్తోందన్నారు. విద్యారంగం సమగ్ర దృక్పథానికి నేరుగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జ్యోతి, కార్తీక్, సౌమ్య, సురేష్, చక్రి, సాయి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యుటిఎఫ్ మండల కార్యవర్గాల ఎన్నిక

ప్రజాశక్తి - కొవ్వూరు, రాజానగరం

యుటిఎఫ్ కొవ్వూరు మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు శ్రీనివాస్, అధ్యక్షులు ఆర్.సురేష్ కుమార్, సహాధ్యక్షులుగా సిహెచ్‌వి.నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శిగా ఎండి. ఇమ్రాన్ బాషా, మహిళా అధ్యక్షురాలు ఇ.ఉమాదేవి, కోశాధికారి కె.వెంకట్రావు, మండల కార్యదర్శులు సిహెచ్.మహేష్, జై.నాగేశ్వరరావు ఎం.త్రినాథ్, కె.రాజేశ్వరి, వి.నాగబాబు, ఎస్‌విఎస్.సుమలత, వి.పార్వతీ పరమేశ్వర శాస్త్రి, కౌన్సిలర్లు ఆర్.సురేష్ కుమార్, ఎండి. ఇమ్రాన్ బాషా, పివి.రవికుమార్, జె.నీలయ్య, కె.ఏడుకొండలు, ఇ.నాగశేషు, కె.శ్రీనివాస్, మండల ఆడిట్ కమిటీ బి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

రాజానగరం మండల శాఖ గౌరవాధ్యక్షునిగా బివిఎస్.చౌదరి, అధ్యక్షునిగా ఎస్.అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయుడు కెవి.రమణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి, జిల్లా నాయకులు ఐ.ప్రసాద్, విజయగౌరి, దయానిధి, రమేష్, శ్రీనివాస్, రాజేశ్వరి, శ్రీనుబాబు, విజయబాబు అందజేశారు. అధ్యక్షునిగా అనిల్ కుమార్, కార్యదర్శిగా ఐ.విజయబాబు, ట్రెజరర్‌గా ఫణి కుమార్ ఎన్నికయ్యారు.



కొవ్వూరులో ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

శక్తి సంరక్షణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

శక్తి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల నుంచి వై.జంక్షన్ వరకూ శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యూజీ, పీజీ విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కె. జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి, స్థిరత్వానికి శక్తి వనరుల సక్రమ వినియోగం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రోజువారీ జీవితంలో శక్తి పొదుపు అలవాట్లు అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి శక్తి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. శక్తి వనరులను కాపాడటం మన అందరి బాధ్యత అని, ఈ అవగాహనను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వాసు

మంత్రి లోకేష్ పర్యటన విజయవంతం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

మంత్రి నారా లోకేష్ రాజమహేంద్రవరం పర్యటన విజయవంతమైందని, సుమారు 30 వేల మంది ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరైయ్యారని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనను చూసి ప్రజలు లోకేష్ పర్యటనకు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. ఈ పర్యటనకు సహకరించిన కూటమి నేతలు, కార్యకర్తలు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యాలయాల్లోకి రాజకీయాలు లాగుతున్నారని కొంత మంది చేస్తున్న ప్రకటనలను ఆయన ఖండించారు. అటువంటి ప్రయత్నాలు తమ ప్రభుత్వం చేయదని, విద్యాసంస్థలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, ప్రకటన రాయించడం చేయలేదన్నారు. వాటిని తాను పూర్తిగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి నాయకులు మజ్జి రాంబాబు, కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, కడలి రామకృష్ణ, రెడ్డి మణి, బుడ్డిగ రవి, జానకి రామయ్య, కొయ్యల రమణ, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ, కొవ్వూరు

పర్యావరణాన్ని మనం కాపాడితే.. పర్యావరణం మనల్ని, మన భావితరాలను కాపాడుతుందని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. ఆనం కళాకేంద్రంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ఈ నెల ఆపర్చునిటీస్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చెత్తను వనరుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్వయం ఉపాధి సాధ్యమవుతుందని కమిషనర్ అన్నారు. తడి చెత్త నుంచి కంపోస్ట్ తయారీ, వర్మికంపోస్టింగ్, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు వంటి కార్యక్రమాల ద్వారా ప్రతినెలా నిరంతర ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా కొత్త ఉత్పత్తులు తయారు చేయవచ్చని.. ఈ రంగంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని అన్నారు. బయోడిగ్రేడబుల్ కవర్లు, క్లాత్ బ్యాగులు, పేపర్ ప్లేట్లు, సహజ ఉత్పత్తుల తయారీ ద్వారా స్వయం ఉపాధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇవి పర్యావరణానికి మేలు చేస్తూనే ఆర్థిక స్వావలంబనను పెంచుతాయని చెప్పారు. మరోవైపు సోలార్ ఎనర్జీ, ఎనర్జీ సేవింగ్ పరికరాలు, గ్రీన్ టెక్నాలజీల ద్వారా విద్యుత్ వినియోగం తగ్గడమే కాక కొత్త ఉద్యోగావకాశాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఈ విధంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే థీమ్ కార్యక్రమాల ద్వారా పరిసరాలను పరిశుభ్రపరచడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను చేరుకోగలుగుతామని కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ఎకో-ఫ్రెండ్లీ ఉత్పత్తుల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ యానాపు యేసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వర్ణాంధ్ర స్వచ్ఛందర సాధ్యమవుతుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా సంపద సృష్టించవచ్చన్నారు. కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, వర్మికంపోస్ట్ ఎనర్జీ యూనిట్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ జె.సునీత, నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్యనేని చిన్ని పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

కూటమి నాయకులు విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని వైసిపి నాయకుడు, మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా విమర్శించారు. శనివారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని తన స్వగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పార్టీలైన టిడిపి, జనసేన పార్టీలకు ప్రచారయావ ఎక్కువైందని విమర్శించారు. గత వైసిపి హయాంలో నన్నయ్య ఆదికవి యూనివర్సిటీ ప్రాగణంలో నిర్మించిన ఇంజినీరింగ్ విభాగం భవనాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినట్టు ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. పాఠశాల స్థాయి నుండి యూనివర్శిటీ స్థాయి వరకు తమ ప్రభుత్వం రాజకీయ జోక్యం లేదన్నారు. లోకేష్ పర్యటనను పురస్కరించుకుని అర్ధరాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వాటిలో గాజు గ్లాసు, సైకిల్ గుర్తులు పెట్టి పసుపు మయంగా మార్చారని విమర్శించారు. తమ ప్రభుత్వం హయాంలో విద్యారంగాన్ని బలోపేతం చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన జరుగుతోందని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కూటమి నేతలు రౌడీయిజం, గుండాయిజం చెలాయిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. దేవాలయం వంటి విద్యా సంస్థల్లో రాజకీయాలకు తావులేదని, స్థానిక ఎంఎల్ఎ దంపతులు ఆదికవి నన్నయ్య యూనివర్శిటిని రాజకీయ వేదికగా వాడుకుటుంన్నారని విమర్శించారు.

ఉషోదయకు జాతీయ స్కూల్స్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-నల్లజర్ల

జాతీయ స్కూల్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న ఉషోదయ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మీసాల చల్లారావుకు పలువురు అభినందనలు తెలిపారు. 30 ఏళ్లుగా ఎంతోమంది పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించి ప్రజల మన్ననలు పొందిన ఉషోదయ పబ్లిక్ స్కూల్ 2025 జాతీయ స్కూల్స్ ఎక్సలెన్స్ అవార్డును బ్రెయిన్ ఫీడ్ సంస్థ అందజేసింది. ఈ నేపథ్యంలో అవార్డు అందుకున్న చైర్మన్ చెల్లారావును ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వలిరెడ్డి పృథ్వీరాజ్, చిర్రా సాయి, గొర్రెల వసంత్, డి.బాలు, జి.విజయశంకర్, ఉపాధ్యాయులు అరుణ పలువురు విద్యార్థులు స్కూల్ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మీసాల లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పని చేయిస్తే చర్యలు

ప్రజాశక్తి-గోపాలపురం

బాల కార్మికులను పనుల్లో పెట్టుకొని వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలిత కుమారి హెచ్చరించారు. శనివారం గోపాలపురంలో పలు వ్యాపార సంస్థలు, హోటల్స్, కర్మాగారాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు ఆమె తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవద్దంటూ వ్యాపారులకు, యజమానులకు అవగాహన కల్పించారు. బాల కార్మికులను ఎవరైనా పనుల్లో పెట్టుకుని నిర్బంధించి వెట్టి చాకిరీ చేయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే ఎవరైనా గుర్తించి తమ కార్యాలయాలకు సమాచారం అందించాలని వారు సూచించారు. వ్యాపారులు, షాపులకు సంబంధించి లేబర్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇ శ్రమ్ కార్డు అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఇ-శ్రమ్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఇఎస్ఐ, పిఎఫ్‌లు లేనివారు తప్పనిసరిగా ఇ శ్రమ్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. 16 నుంచి 59 ఏళ్ల లోపు ఎవరైనా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే, శాశ్వత వైకల్యం పొందినా రూ.2 లక్షల వరకూ ఆర్థిక సాయం లభిస్తుందని తెలిపారు. అసంఘటిత కార్మికులకు ఒక గుర్తింపు కార్డుగా పనిచేస్తుందని దీని ద్వారా ప్రభుత్వ సేవలను స్వభంగా పొందవచ్చు అని అన్నారు. ఈ తనిఖీల్లో జూనియర్ అసిస్టెంట్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



షాపుల్లో తనిఖీలు చేస్తున్న లేబర్ అధికారి ఎం.లలిత కుమారి

సంసద్ ఖేల్‌లో చాగల్లు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చాగల్లు


రాజమహేంద్రవరంలో 19న జరిగిన జిల్లా స్థాయి సంసద్ ఖేల్ క్రీడల్లో చాగల్లు విద్యార్థులు పాల్గొని బాలుర విభాగంలో కబడ్డీలో 38 పాయింట్లు తేడాతో విజయం సాధించారని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వి.వాసవి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ నందిని, గ్రామస్తులు తల్లితండ్రులు అభినందించారు.

గిరిజన సంక్షేమ హాస్టల్లో 'ముస్తాబు'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

స్థానిక పిఎంఎస్ గర్ల్స్ హాస్టల్ 1, 2లో శనివారం 'ముస్తాబు' కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ శాఖ అడాప్షన్ ఆఫీసర్ ఎం.కమల ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థినుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక అమలును పరిశీలించి, ఉత్తమ విద్యా ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థినులు చక్కని ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల టాయిలెట్లలో పరిశుభ్రత మరింత మెరుగు పరచాలని హెచ్‌ఎం ఎం.ఇందిరా ప్రియదర్శినికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, క్రాంతి, త్రివేణి, లక్ష్మణ్, శ్రీనివాస్, సూర్యం పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





విద్యార్థులకు గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న అనంతరం సాయి

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచి నైతిక విలువలతో దేశభక్తి కలిగి ఉండి ఒత్తిడికి లోను కాకుండా చదువు కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మోటివేటర్ అనంతం సాయి విద్యార్థులకు సూచించారు. మానవత శాఖ ఆధ్వర్యంలో అన్నదేవరపేటలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. సాయి మాట్లాడుతూ విద్యార్థులు ఏ విధంగా నడుచుకోవాలి, ఉన్నత ర్యాంకులు సాధించుకోవడానికి విద్యలో పలు మెలుకువలు తెలియజేస్తూ అవగాహన కల్పించారు. పరీక్షల్లో ప్రతిభ చూపిస్తూ మొదటి రెండు మూడవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 120 మంది విద్యార్థులకు దేశ నాయకులు చిత్రాలతో ఉన్న స్టిక్కర్లు, ఒక్కొక్క ఫైల్, పెన్ను అందజేశారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్ పాఠశాల లైబ్రరీకి కొన్ని పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, ఐ.అబ్బులు, జి.సాయి బాబా, బి.శంకర్, వి.రఘు కిషోర్, కె.గణపతి పాల్గొన్నారు.



గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పోల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గోకవరం, బిక్కవోలు, గోపాలపురం

గోకవరం మండలం జి.కొత్తపల్లి పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ తిరన్ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలో 40 బూత్‌లు, 3 ట్రాన్సిట్ పాయింట్స్, రెండు మొబైల్ వాహనాలతో మొత్తం 6,392 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.

బిక్కవోలు కొంకుదురు పిహెచ్‌సి పరిధిలో డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 11 సచివాలయాల్లో 18 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 3,433 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించుకోవాలని ఆమె తెలిపారు.

గోపాలపురం అన్నదేవరపేట, హుకుంపేట పిహెచ్‌సిల వైద్యులు పి.స్వర్ణలత, బి.దుర్గాభవాని మాట్లాడుతూ రెండు పిహెచ్‌సిల పరిధిలో 7,077 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 62 బూత్‌లు, ఆరు రూట్లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు గోపాలకృష్ణ మృతి

ప్రజాశక్తి-తాళ్లపూడి

మూడు దశాబ్దాలుగా పలు పత్రికల్లో పని చేసిన వేగేశ్వరపురం గ్రామానికి చెందిన నండూరి గోపాలకృష్ణ (70) శనివారం మృతి చెందారు. గత రెండు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న ఆయన శనివారం ఉదయం బాత్రూంలో పడిపోయారు. లేచిన అనంతరం ఆసుపత్రి వెళదామని బయల్దేరుతుండగా స్ట్రోక్ రావడంతో ఆయన మరణించారు. ఆయన గతంలో ఆంధ్రభూమి, విశాలాంధ్ర, విజన్ పత్రికల్లో పని చేశారు. తాళ్లపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయులు ఆయనకు నివాళులర్పించారు. తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, తహశీల్దారు లక్ష్మీ లావణ్య, జెఎసి నాయకులు జోడాల సంతాపం తెలిపారు.

నేరాలు ఘోరాలు

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

గత మూడేళ్లుగా కాజులూరు, తాళ్లరేవు, కరప మండలాల్లో మహిళలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచింగ్ ముఠా ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు, ఏకంగా 29 నేరాలతో సంబంధం ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.58 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి బిందుమాధవ్ వివరాలను వెల్లడించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. డిసెంబర్ 19వ తేదీన కోలంక గ్రామ శివారు గోపిపేట వంతెన వద్ద నిఘా పెట్టడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముల్లాడి విజయ్‌కుమార్, పెసింగి రాధాకృష్ణ, ముల్లాడి సతీష్, పారంశెట్టి బుజ్జి వెంకట దుర్గారావును అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ ముఠా ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని మంగళ సూత్రాలను, బంగారు గొలుసులను బైకులపై వేగంగా వచ్చి లాక్కెళ్లేవారన్నారు. అరెస్టయిన వారిలో విజయ్ కుమార్, రాధాకృష్ణలపై అత్యధికంగా 22 నుంచి 25 కేసులు ఉన్నాయని అన్నారు. కాకినాడ జిల్లాతో పాటు కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోనూ ఈ ముఠా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిందని తెలిపారు. ఈ ముఠా నుంచి రూ.56 లక్షల విలువ చేసే 452 గ్రాములు బంగారం, రూ.2 లక్షలు విలువచేసే ఐదు మోటర్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభను కనబరిచిన రూరల్ సిఐ చైతన్య కృష్ణ, ఎస్ఐ మోహన్‌కుమార్, హెచ్‌సి నరసింగరావు, కానిస్టేబుల్ గోవిందరాజులు, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి దొంగలను వేటాడిన సిబ్బందికి రివార్డులను ప్రకటించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

చర్చికి పెయింటింగ్ వేస్తూ ఒక వ్యక్తి కాలుజారి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాకినాడ జగన్నాథపురంకు చెందిన పలివెల సతీష్ ఉప్పాడలోని ఒక చర్చికి పెయింటింగ్‌ను రెండు రోజులుగా వేస్తున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా చర్చి గోడలకు పెయింటింగ్ వేస్తుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో హుటాహుటీన అతనిని స్థానిక పిహెచ్‌సికి తరలించారు. సతీష్ కాలు విరిగిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమిక వైద్యం అనంతరం క్షతగాత్రుడిని కాకినాడకు తరలించారు.

బైకు దొంగకు జైలు శిక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

బైక్ చోరీ నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ కాకినాడ 5వ జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఎస్‌కె షారోని తీర్పు వెలువరించినట్లు సిఐ కృష్ణభగవాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాధపట్నం, వేట్లపాలెం గ్రామానికి చెందిన పిల్లి విజయ్‌కుమార్, వీర వెంకట సత్యనారాయణకు చెందిన బైక్‌లు చోరీ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ కేసులో నిందితుడైన ఖమ్మం జిల్లా అర్వారావుపేటకు చెందిన సారిపల్లి నరసయ్యరాజుకు ఒక నెల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు.



దాతకు స్వామి వారి చిత్రపటం బహూకరిస్తున్న చక్రి

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

ముమ్మిడివరానికి చెందిన రామాయణం శ్రీరామ చిరంజీవి, కుటుంబసభ్యులు అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని శనివారం దర్శించుకున్నారు. స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) స్వామి వారి చిత్రపటం అందజేశారు.

పథకాలు అందేలా చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి కుటుంబానికి నూరు శాతం సంక్షేమ పథకాలు అందింలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ విజెవి.రమణ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లక్ష్మణరావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్ళి కుటుంబ సర్వే చేయాలన్నారు.

యానాం వార్తలు

49 మంది హోంగార్డులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీసుశాఖలో పనిచేస్తున్న 49 మంది హోంగార్డులకుఉద్యోగోన్నతి కల్పిస్తూ పోలీస్ స్పెషల్ ఆఫీసర్ ఆర్.ఎలుమలై ఉత్తర్వులు జారీచేశారు. వీరి విద్యార్హత ధ్రువపత్రాలను ఈ నెల 23న పరిశీలించనున్నట్లు తెలిపారు. యానాం నుంచి దువ్వారపు వి.జానకిరామయ్య, మెల్లం గిరీష్ సుధాకరరావు, కుక్కల దుర్గాప్రసాద్ ఉద్యోగోన్నతి పొందారు.

నేడు పల్స్‌పోలియో కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

యానాంలో నేడు పల్స్‌పోలియో కార్యాక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు వైద్యశాఖ అధికారి టి.రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలున్న పోలియో చుక్కలు పిల్లలకు వేయించవచ్చున్నారు.

అభివృద్ధి మాట.. హామీల పాట..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటనలు ఆద్యంతం జిల్లా ప్రజలను ఉసూరుమనిపించాయి. ఎప్పటిలానే అభివృద్ధి మాట.. హామీల పాటలతో పర్యటనలు మమ అనిపించారు. మంత్రి నారా లోకేష్ పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్యార్థులతోనూ ముఖాముఖి అయ్యారు. క్రమంతప్పక ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. మరోవైపు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ఇచ్చిన హామీ నీటిమీద రాతలుగా మిగిలిపోయింది. కేవలం ఒకటి లేక రెండు నోటిఫికేషన్‌లు మినహా గడిచిన 18 నెలల్లో నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదు. ఇంకోవైపు నిరుద్యోగ భృతి హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇటువంటి కీలకమైన సమస్యలను పరిష్కరించకపోగా విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలంటూ హితవు పలికారు. ఉద్యోగాల కల్పనకు అకడమిక్స్‌తో పాటు ఇండస్ట్రీని అనుసంధానిస్తామని, కేజీ నుంచి పీజీ వరకు స్త్రీలకు ప్రత్యేక కార్యచరణ, జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ హామీలను గుప్పించటం చర్చనీయాంశమైంది. గత నెలలో నిర్వహించాల్సిన ఈ పర్యటన టిడిపిలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో పలుమార్లు వాయిదా పడింది. సిటీ ఎంఎల్‌ఎతో పాటు పలువురు ముఖ్యనేతలు మద్యం సిండికేట్‌లకు వెన్నుదన్నులా ఉన్నారనే ఆరోపణలు గత నెలరోజులుగా భగ్గుమంటున్నాయి. దీంతో పాటు రాజానగరంలో టిడిపి, జనసేన నేతల మధ్య ఆరంభం నుంచి లుక లుకలు వెంటాడుతూనే ఉన్నాయి. పలుమార్లు ముఖ్యనేతలు వారించినా ఫలితం లేకపోయింది. తాజాగా లోకేష్ పర్యటన కూడా ఈ ఆధిపత్య పోరుకు వేదికైంది. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో తమకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదంటూ జనసేన ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ ఆయన అనుచరులు చేసిన వీరంగం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే విధంగా అమరజీవి జలధార పేరుతో పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకానికి ప్రారంభోత్సవం చేపట్టారు. రెండేళ్లలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే సహించబోమని అధికారులను ఆదేశించారు. ఇటువంటి ప్రకటన హర్షించదగినదే. అయితే పిఠాపురం నియోజకవర్గంలో గత కొంతకాలంగా నెలకొన్న అనిశ్చితిపై కనీసం స్పందించకపోవటం విస్మయానికి గురి చేస్తోంది. పిఠాపురం నియోజక వర్గం, కొత్తపేటలో ఒక క్రైస్తవ మందిరాన్ని, ఆర్‌ఎస్‌ఎస్ ఇతర అనుబంధ సంస్థలు లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అధికారులు జోక్యం చేసుకున్నప్పటికీ ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. మరోవైపు గత నెలలోనే ఒక పాఠశాలలో విద్యార్థులపై కుల వివక్ష చూపించారంటూ విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. ఈ సమస్యను పరిష్కరించకపోగా ప్రతిపక్ష వైసిపి విద్యార్థులతో కుల రాజకీయం చేస్తోందంటూ ఉపముఖ్యమంత్రి స్థాయి నేత విమర్శించటం చిత్తశుద్ధి లేమికి దర్పణం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోనే పిఠాపురం నియోజకవర్గం ఓ రోల్ మోడల్ కాబోతోందంటూ ఆశించిన అక్కడి ప్రజలకు గడచిన 18 నెలల్లో ఎటువంటి భరోసా లభంచలేదు. అభివృద్ధి జాడే లేదు. మరోవైపు ఎంఎల్‌ఎలూ అందుబాటులో లేరు. మాజీ ఎంఎల్‌ఎ వర్మపైనా జనసేన నేతలు సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలతో ఇప్పటికీ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. మొత్తం మీద ఆ నియోజకవర్గం చుక్కాని లేని నావలా తయారయిందనడంలో ఎటువంటి సందేహమూ లేదని సుస్పష్టమవుతోంది.



ప్రదర్శన నిర్వహిస్తున్న కాపవరం గ్రామస్తులు

కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని నిరసన

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని మండలంలోని కాపవరం గ్రామస్తులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నినాదాలు చేశారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఆకాంక్షలు నెరవేరకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్నం సతీష్, మాజీ ఎంపిటిసి సభ్యుడు గీశాల శతకోటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జి.సత్యనారాయణ, గుంటూరు ప్రసాద్, వాసంశెట్టి ఏడుకొండలు, ములగపాటి జోగిరాజు, నరాల వీరభద్రం, గీశాల మహేశ్వరరావు, కాదా శ్రీనివాస్ అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు సంతకాలు సేకరణ లో పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న ప్రజాసంఘాలు

'విబి జి రామ్‌జీని ఉపసంహరించుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేదల పొట్ట కొడుతూ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా తీసుకు వచ్చిన విబి జి రామ్ జి చట్టాన్ని ఉపసంహారించుకోవాలని సిపిఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవన విధానానికి భరోసానిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడుస్తూ, కొత్తగా తీసుకువచ్చిన 'విబి –జి రామ్–జి (వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్) బిల్లును వెంటనే ఉపసంహారించాలన్నారు. ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదలు చేశారు. అనంతరం తహశీల్దార్ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన ఆందోళనలో పార్టీ మండల కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణరావు, ఎన్. వెంకటేష్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనకు టిఎల్‌ఎం దోహదం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోదించేందుకు టిఎల్‌ఎం దోహదం చేస్తోందని డిఇఒ పి. నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలోని క్లస్టర్ కాంప్లెక్స్‌ను శనివారం డిఇఒ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన టిఎల్‌ఎంలను పరిశీలించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించెందు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'ముస్తాబు కార్యక్రమం'లో భాగంగా ముస్తాబు సామాగ్రిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, డిసిఇబి సెక్రెటరి బి.హనుమంతురావు, ఎంఇఒలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక అచ్చంపేటలోని తన నివాసంలో మండలంలోని పనసపాడు గ్రామానికి చెందిన పాలిక జష్మితకు సిఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదలైన రూ.51,300 చెక్కును ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్, టిడిపి నాయకులు అనుసూరి రాంబాబు, అమలాపురపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ సుధీర్ తదితరులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీలోని స్థానిక ఎస్‌విఫంక్షన్ హాలు నందు శనివారం ట్రూత్ కాన్ఫనెన్స్ టీమ్, మంజీరా సూపర్ స్పెషాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంజీరా ఆసుపత్రి అధినేత డాక్టర్ సుధీర్ పాల్గొని మాట్లాడుతూ క్రిస్మస్‌ను కుటుంబ సమేతంగా జరుపుకోవడం ఐక్యతకు చిహ్నమన్నారు. డాక్టర్ మంజీరా జ్యోతి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణల సమ్మిళతమే క్రిస్మస్ వేడుక అని అన్నారు. అనంతరం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రేమ్ చంద్ సారథ్యంలో కేక్ కట్‌చేసి, క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టరు జిల్లా ఫెలోషిప్ సెక్రటరీ యెహోషువ, శామ్యూల్ జ్యోతి, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం సహకార సొసైటీ సభ్యుడు మాకే వెంకన్న బాబు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయనకు సహకార సొసైటీలో ఇన్సూరెన్స్ పాలసీ ఉంది. ఈ కారణంగా వెంకన్న బాబుకు రూ.50 వేలు బీమా సొమ్ము మంజూరు అయ్యింది. శనివారం సొసైటీ కార్యాలయంలో వెంకన్న బాబుకు మంజూరైన రూ.50 వేల చెక్కును సొసైటీ చైర్మన్ చిక్కం ఉమేష్ అందజేశారు. కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ పిఎర్‌ఎన్.శర్మ, బ్యాంకు సూపర్‌వైజర్ ఎం.నరేష్, సిఇఒ ఆకుల సూర్యప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిపిఒ శాంతా లక్ష్మి సూచించారు. నగరంరలో శనివారం సర్పంచ్ జాలెం రమణకుమారి అధ్యక్షతన జరిగిన నాసా ప్రోగ్రాంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని 150 పంచాయతీలకు గాను 90 శాతం పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉందన్నారు. మిగిలిన పంచాయతీల్లో కూడా పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పి బొజ్జిరాజు, డిప్యూటీ ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విధానాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక విధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపిడిఒ జి.భవానీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో విఆఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ టెక్నాలజీపై శనివారం శిక్షణా కార్యక్రమ నిర్వహించారు. విధులతో పాటు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని విఆర్‌ఒల వినతి

ప్రజాశక్తి -గోకవరం

పని ఒత్తిడి నుంచి వెసులుబాటు కల్పించాలని విఆర్‌ఒలు స్థానిక డిప్యూటీ తహశీల్దారుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో తమ విధుల కారణంగా పని ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేల్లో తమకు మినహాయింపు ఇవ్వాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధార్ ఆప్షన్‌తో వేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని కోరారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌కెబిఆర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బారావు అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ సిఐ వీరబాబు మాట్లాడుతూ అరచేతిలో ఇముడుతున్న సెల్ ఫోన్ వినియోగంలో మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలన్నారు. పిడి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణంలో భావిభారత పౌరులుగా నేటి విద్యార్థుల పాత్ర గణనీయమైనదన్నారు. సైబర్ నేరాల టెక్నీషియన్ ఫణీంద్ర పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ వెంకటపతి రాజు, మెండు బాలాజీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు రోటరీ క్లబ్, ఆకొండి ట్రస్ట్ అమలాపురం వారు సంయుక్తంగా 11 మంది విద్యార్థులకు యూనిఫామ్‌ను బహూకరించారని ప్రిన్సిపల్ డా వి నరసింహస్వామి శనివారం తెలిపారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వరదా మల్లేశ్వరరావు, అధ్యక్షులు ఆర్‌డిఎస్ ప్రసాద్, సెక్రెటరీ ఆకొండి పవన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్, ఆకొండి ట్రస్ట్ అమలాపురం వారికి ప్రిన్సిపల్ నరసింహస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కరుణశ్రీ, డాక్టర్ బాలస్వామి, డాక్టర్ ఆశిష్ బాబు, శైలజ, త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మంత్రి సుభాష్ సూచించారు. రామచంద్రపురంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొని ప్రసంగించారు.. గత హాస్టల్ బిల్డింగ్‌లో ఉన్న విద్యార్థినుల అవస్థలు చూసి పట్టణంలోని ఒక ప్రయివేటు బిల్డింగ్‌కు విద్యార్థులను తరలించి సహాయం చేసిన మంత్రికి విద్యార్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంఇఒలు వీర రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, గొల్లపల్లి కష్ణ, ప్రిన్సిపల్ జె శైలజ, వైస్ ప్రిన్సిపల్ రేణుక దేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గురుకుల పాఠశాల అభివృద్ధికి హామీ ఇచ్చిన మంత్రి సుభాష్ ను సిబ్బంది, విద్యార్థుల సత్కరించారు.

చెత్తకు ఉచితంగా కూరగాయల పంపిణీ

- పరిసర ప్రాంతాల ప్రజల నుంచి అనూహ్య స్పందన
- ద్వారకామయి ఇండస్ట్రీ ఆధ్వర్యంలో కూరగాయల పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం

చెత్తకు కూరగాయల ఉచిత పంపిణీ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోనక్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డిగూడెంలోని 17వ వార్డులోని జై వాసవి స్టీల్ ఎదురుగా ద్వారకామయి ఇండస్ట్రీ ఆధ్వర్యంలో పెన్మత్స సునీత సౌజన్యంతో చెత్తకు బదులు కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం మున్సిపాలిటీ అధికారులు హాజరయ్యారు. కాలుష్యకారకమైన ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు అంతా పాటుపడాలని అధికారులు సూచించారు. స్వచ్ఛమున్సిపాలిటీ కోసం అంతా బాధ్యతగా చెత్తను రీసైకిలింగ్ కోసం అంతా కృషి చేయాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తడి-పొడి చెత్తకు కూరగాల పంపిణీ చేస్తున్న ద్వారకామయి ఇండస్ట్రీ వారి ప్రయత్నం అభినందనీయమని అన్నారు. పొడిచెత్తకు సంబంధించి ఖాళీ వాటర్ బాటిల్స్, డ్రింక్ బాటిల్స్ తదితర కేజీ ప్లాస్టిక్‌వస్తువులకు ఒక కిలో ఆలుగడ్డలు లేదా ఉల్లిపాయలు అందించారు. అలాగే ఖాళీ వాటర్ ప్యాకెట్స్, పాల ప్యాకెట్స్, పాలిథిన్ బ్యాగ్స్, వాటర్ గ్లాసులు, న్యూస్ పేపర్లు, పాత పుస్తకాలు, పాత ప్లాస్టిక్ కవర్లు తదితర అక కిలో పాత వస్తువులకు అరకిలో ఆలుగడ్డలు అందించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నంఉచి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు చెత్తను తీసుకువచ్చి బదులుగా కూరగాయలను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పెన్మత్స సత్యనారాయణరాజను పలువురు అభినందించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా తనవంతు స్వచ్ఛ అమలాపురం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ఒ.మంగాదేవి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.కుమార స్వామి, మెప్మా సిఒ, మెప్మా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కూరగాయలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

లబ్ధిదారులకు గ్యాస్‌స్టౌవ్‌ల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

పిఎం ఉజ్వల యోజన పథకంలో భాగంగా శనివారం పినపళ్లలో లబ్ధిదారులకు గ్యాస్‌స్టౌవ్, సిలిండర్ రెగ్యులేటర్ తదితర సామగ్రి, బాండ్లనున వెంకట సూర్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీస్ వారు 22 మందికి పంపిణీ చేశారు. సర్పంచ్ సంగీత సుభాష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు గ్యాస్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సూర్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ అధినేత ఈదల చినబాబు మాట్లాడుతూ ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ సహా అవసరమైన సామగ్రి అందజేస్తామన్నారు. లబ్ధిదారులు ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ ఎఎంసి చైర్మన్ వి.లక్ష్మణరావు, కార్యదర్శి కె.పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న రైతు బజార్లో వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ప్రారంభానికి ముందు రైతు బజారులో తూనికలు, కొలతలు పరిశీలించారు. ఈ సదస్సులో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ మాట్లాడుతూ తూనికలు కొలతలు విషయంలో యజమానులు విధి విధానాలు పాటించాలన్నారు. తూనికలలో మోసం జరిగితే కేసు నమోదు చేస్తామన్నారు. డిసిపిసి సభ్యుడు, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ రైతు బజార్లో నాణ్యమైన కూరగాయలు అమ్మాలన్నారు. తూనికల్లో తేడాలు జరగరాదన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘ కార్యదర్శి ఎం.భాస్కరరావు, సభ్యులు కె.సుధాకర్, సిహెచ్‌వి.చౌదరి, టి.సత్యనారాయణ, వి.శ్యామల, కెవిపి. లక్ష్మి, రైతు బజార్ కార్యదర్శి శ్రీనివాస్, వినియోగదారులు పాల్గొన్నారు.